# రాష్ట్రం ఇక అగ్రగామి!



కోట్లాది రూపాయలు వెచ్చించి స్థలం కొనుగోలు చేసినా.. ప్రాజెక్టు ప్రారంభించడానికి మార్కెట్లో అనుకూల వాతావరణం లేకపోవడంతో భవిష్యత్తు ఏమిటన్నది బిల్డర్ల భయం...

నిధులలేమితో మధ్యలో నిలిచిపోయిన ప్రాజెక్టును ఎలా ముందుకు తీసుకెళ్లాలో అని మరి కొందరి బిల్డర్ల ఆందోళన...

ప్రాజెక్టులకు ఇచ్చిన అప్పులను బిల్డర్లు తిరిగి చెల్లించకపోతే, అవన్నీ నిరర్థక ఆస్తులుగా మిగులుతాయని బ్యాంకుల భయం...

ఇవన్నీ నిన్నటి సంగతులు... ఇలాంటి భయాలన్నింటికీ తాజా ఎన్నికల ఫలితాలు చెక్ పెట్టాయనీ, ఈ ఫలితాలు రియల్ మార్కెట్ స్వతహాగానే పుంజుకోవడానికి దోహదం చేస్తాయనీ గిరిధారీ కన్‌స్ట్రక్షన్ మేనేజింగ్ పార్ట్‌నర్ కె. ఇంద్రసేనా రెడ్డి అన్నారు.

భారతదేశం అభివృద్ధి పథంలోకి దూసుకెళుతున్న నగరాల్లో గ్రేటర్ హైదరాబాద్‌ది ప్రథమ స్థానం. ఇక్కడి మానవ వనరుల లభ్యత, మౌలిక సదుపాయాల అభివృద్ధి తదితర అంశాల వల్ల ప్రపంచ చూపులన్నీ నగరం మీద పడ్డాయి. అందరూ ఊహించినట్టుగానే అభివృద్ధి చెందుతున్న భాగ్యనగరంలో రియల్టీ రంగం కూడా ఇలాగే పరుగులు పెట్టింది. ఇటీవల కొంత చతికలపడినా మళ్లీ నిలదొక్కుకోవడానికి అవకాశం ఉంది. సుస్థిర ప్రభుత్వం ఏర్పాటు కావడంతో అభివృద్ధిలో రాష్ట్రం ఇక అగ్రగామిగా నిలుస్తుందనడంలో సందేహం లేదు.

### ప్రభుత్వం పూనుకోవాలి!

వ్యయసాయం తర్వాత అత్యధికంగా ఆధారపడిన పరిశ్రమ నిర్మాణ రంగం. 250కిపైగా పరిశ్రమలు నిర్మాణ రంగం మీదే ఆధారపడ్డాయి. ఇటీవల మార్కెట్లో నెలకొన్న అనిశ్చితి కారణంగా ఈ రంగంపై ఆధారపడిన వారంతా రోడ్డున పడే దుస్థితి వచ్చింది. వీరందరికీ తిరిగి ఉపాధి కల్పించే బాధ్యతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాలి.

### స్థానిక అంశం ఇక లేనట్టే!

ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని ఇప్పటికే నిరూపితమైంది. స్థానిక రాజకీయాంశాన్ని భూతద్దంలో చూసి వెనకడుగు వేసినవారు, ధరలు ఇంకా తగ్గుతాయేమోనని ఎదురు చూసిన వారు ఇప్పుడు కొనుగోలు చేయడానికి ముందుకొస్తున్నారు. రాష్ట్రంలో స్థిర ప్రభుత్వం ఏర్పడడం.. నగరం ఇక అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి అవకాశాలు మెరుగవడంతో ఇప్పటికే రియల్ ఎస్టేట్ మార్కెట్లో ఉత్సాహం ప్రారంభమైంది. ఇటీవలి వరకు ఆచితూచే ధోరణి అవలంబించిన విదేశీ కంపెనీలు ఇపుడు పునరాలోచన చేస్తున్నట్లు సమాచారం. 100 అంతస్తుల రిలయన్స్ టవర్ త్వరలోనే కార్యరూపం దాలుస్తుందని తెలుస్తోంది. అలాగే నక్షత్ర హోటళ్ల సముదాయం వంటివి కూడా నిర్మాణం జరుపుకుంటాయని ఆశిస్తున్నాం.